# రేపటి నుంచి అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం



దమ్మపేట, ఏప్రిల్ 13 : అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ వార్షిక మెయింటెనెన్స్ పూర్తి చేసి సోమవారం నుంచి పునః ప్రారంభించనున్నట్లు టీఎస్ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్, అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు సుధాకర్ రెడ్డి, కళ్యాణ్, బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని వార్షిక మెయింటెనెన్స్ చేయడానికి సోమవారం నుంచి నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పామాయిల్ గెలలను అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి తీసుకురావాలని మేనేజర్లు సూచించారు.

# పంటలు ఎండబెట్టిన ఘనత కాంగ్రెస్‌ది..

- అన్ని వర్గాల్లో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత
- నాకు ఓటు వేసి గెలిపిస్తే మీ తరపున పోరాడుతా : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- ఎక్కడ చూసినా కరువే.. : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు
- నామా జీవితం తెరిచిన పుస్తకం : ఎమ్మెల్సీ తాతా మధు
- కష్టపడితే నామాకు మెజార్టీ : జడ్పీ చైర్మన్ కమల్‌రాజు
- ముదిగొండలో బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా. పక్కన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

ముదిగొండ, ఏప్రిల్ 13 : అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో ఒక్క తడికి నీరివ్వకపోవడంతో జిల్లాలో చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయని, గత కేసీఆర్ పాలనలో ఏనాడూ పంటలు ఎండిపోయిన దాఖలాలు లేవని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే మీ తరపున ఢిల్లీలో పోరాడుతానని, రెండుసార్లు ఎంపీగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడానని ఆయన గుర్తు చేశారు. శనివారం ముదిగొండలో జరిగిన మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ప్రజల కోసం ఎంతో చేసినా.. కాంగ్రెస్ పార్టీ ఇంకా ఏదో చేస్తుందని గెలిపించిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. అబద్ధపు ప్రచారాలు, అలవి కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక లేని పాలన చేస్తోందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో ఏం చేసిందో ప్రజలకు తెలుసని, అయితే వంద రోజుల కాంగ్రెస్ పాలన చూస్తే వాళ్లకు అర్థమవుతుందన్నారు.

అన్ని వర్గాల్లో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వచ్చిందని, దానిని సరిగా వినియోగించుకుంటూ పార్లమెంటు ఎన్నికల్లో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. హైవే కోసం భూములు కోల్పోయిన రైతులకు తక్కువ పరిహారం ఇస్తే తానే కేంద్ర ప్రభుత్వంపై పోరాడి ఎక్కువ పరిహారం వచ్చేలా చేశానన్నారు.

### ఎక్కడ చూసినా కరువే.. –రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటే.. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా కరువే కనిపిస్తోందన్నారు. కేసీఆర్ ముందు చూపుతో నీటి ఎద్దడి లేకుండా బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రం పాలు చేసిందన్నారు. కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ కరువు ఉంటుందని, బెంగుళూరులో హోటళ్లలో సాంబారు చేయొద్దని జీవో ఇచ్చారని, ఆ పరిస్థితి హైదరాబాద్‌లో కూడా అతి త్వరలోనే వస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. ఇవన్నీ గ్రహించి ప్రజలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామాకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

### నామా జీవితం తెరిచిన పుస్తకం –బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

ఎంపీ నామా నాగేశ్వరరావు జీవితం తెరిచిన పుస్తకమని, జిల్లాలో ఆయన గురించి తెలియని వారు లేరన్నారు. కొన్ని కారణాల వల్ల మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారిందని, మారిన ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత ఉన్నదని, కొద్దిగా కష్టపడితే ఈ ఎన్నికల్లో ఎంపీగా నామా గెలుపు ఖాయమని అన్నారు. బీసీ అయిన డీసీసీబీ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణాన్ని పదవిలో నుంచి దించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. మీ వెంట ఉన్న నాయకుల మాదిరిగా ఆయన వందల కోట్లు దోచుకోలేదని, కేవలం బీసీ అనే ఆయన్ను పదవీచ్యుతున్ని చేశారన్నారు.

### కష్టపడితే నామాకు మెజార్టీ –జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేస్తే ఎంపీగా నామా నాగేశ్వరరావుకు గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేశామా.. అని ప్రజలు బాధపడుతున్నారని, ఆ వ్యతిరేకతను మనకు అనుకూలంగా మలుచుకోవాలన్నారు. గత కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు వచ్చాయని, కానీ.. కాంగ్రెసోళ్లు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఎన్నికల కోడ్ అంటూ సాకులు చెబుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ఇంకా నెల రోజులే గడువు ఉన్నా ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించలేని పరిస్థితిలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉందని, దీంతోనే నామా గెలుపు ఖాయమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు బత్తుల వీరారెడ్డి, మీగడ శ్రీనివాస్ యాదవ్, పోట్ల ప్రసాద్, తోట ధర్మారావు, పచ్చ సీతారామయ్య, బంక మల్లయ్య, కోటి అనంతరాములు, మందరపు ఎర్ర వెంకన్న, కోడె బాబు, పంది శ్రీను, భిక్షం, ఖాజా, కొమ్మూరి స్వాతి, నాగయ్య, శంకర్, రమేశ్, సత్యనారాయణరెడ్డి, సిల్వారాజు, అమడాల జక్కర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# ఉపాధికి ఎసరు!

- ఏటికేడు ఉపాధి పనులను కుదిస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వం
- భద్రాద్రి జిల్లాలో నిరుడు 42 లక్షల పనిదినాలు
- ఈ ఏడాది 32 లక్షల పనిదినాలకు కుదింపు
- పని దినాలు తగ్గించడంతో ఆందోళన చెందుతున్న కూలీలు



లక్ష్మీదేవిపల్లిలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 13 : వలసలను నిరోధించేందుకు, స్థానికంగానే కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం(యూపీఏ) ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకానికి ఇప్పటి కేంద్ర ప్రభుత్వం(ఎన్‌డీఏ) తూట్లు పొడుస్తోంది. ఏకంగా పని దినాలను తగ్గిస్తోంది. దీంతో ఏటికేడు పరిశీలిస్తే ఈ తగ్గుదల గణనీయంగా ఉంది. సుమారు 40 రకాల పనులను ఈ పథకంలో చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 14 పనులను మాత్రమే జాబితాలో చేర్చింది. కూలీలను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది.

### ఏటా పనిదినాల తగ్గింపు

భద్రాద్రి జిల్లాలో ఎక్కువగా ఆదివాసీలు, గిరిజనులు నివాసం ఉన్నారు. బతుకుదెరువు కోసం గతంలో వలసలు వెళ్లిన వీరంతా ఉపాధి హామీ పథకం వచ్చాక స్థానికంగానే ఉంటూ ఆ పనులు చేస్తూ జీవిస్తున్నారు. జాబ్ కార్డులో పేరున్న కుటుంబ సభ్యులందరూ ఈ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఏటికేడూ ఉపాధి హామీ పని దినాలను తగ్గిస్తుండడంతో వారికి తగినన్ని రోజులు పనులు లభించడం లేదు. ఫలితంగా కూలీలందరూ క్రమంగా ఊరిని వదిలి పొట్టచేతపట్టుకొని ఇతరత్రా ప్రాంతాలకు వెళ్తున్నారు. దీనికి తగినట్లుగానే కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా ఈజీఎస్ పని దినాల సంఖ్యను భారీగా తగ్గించింది. ఈ 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 32.78 లక్షల పనిదినాలను మాత్రమే కల్పించాలని కేంద్ర ప్రభుత్వం అధికారులకు నిర్దేశించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 43.16 లక్షల పని దినాల లక్ష్యాన్ని కేటాయించిన కేంద్రం.. ఈ ఏడాది గణనీయంగా సుమారు 10 లక్షల పని దినాలను తగ్గించడం గమనార్హం.

### పని దినాలు పెంచాల్సిందే..



ఏటా పని దినాల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తోంది. దీనిపై ఆధారపడి ఉపాధి హామీ పనులు చేసుకునే మాలాంటి వారికి ఇబ్బందిగా మారుతోంది. గ్రామాల్లో వలసలను నిరోధించడానికి పెట్టిన ఈ పథకం కొనసాగాలంటే వీలైనన్ని ఎక్కువ పని దినాలు కూలీలకు కల్పిస్తేనే బాగుంటుంది. అప్పుడే గ్రామాల్లో కూలీలు వేరే గ్రామాలకు పనులకు వెళ్లకుండా స్థానికంగానే పని చేసుకునే అవకాశం ఉంటుంది.

– మాలోతు నార్యా, లాలుతండా

### వేతనాలు వచ్చేలా చూడాలి



మేం నాలుగు నెలలుగా ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్తున్నాం. అయినా ఇప్పటివరకు వేతనాలు రాలేదు. ప్రతిరోజు ఉపాధిహామీ పనులకే వెళ్తున్నాం. వేరే పనులకు వెళ్లలేకపోతున్నాం. ఈ వారం.. వచ్చే వారం పడతాయేమో అనే ఉద్దేశంతో రోజూ పనులకు వెళ్తున్నాం. వేతనాలు సకాలంలో రాకపోవడంతో పూట గడవడం కష్టంగా ఉంది. అధికారులు సకాలంలో వేతనాలు వచ్చేలా చూడాలి.

– వాంకుడోతు పద్మ, సీతారాంపురం

### ప్రతిరోజూ 50 వేలకు పైగా కూలీల హాజరు

జిల్లాలో మొత్తం 1.29 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. వాటిలో 2.16 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకొని ఉన్నారు. ఉపాధి హామీ పనులను 481 పంచాయతీల్లోని కూలీలు వినియోగించుకుంటున్నారు. ఈ వేసవిలో ప్రతి రోజూ సుమారు 50 వేల మంది ఉపాధి పనులకు వెళ్తుంటారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల్లో సగటున 100 మంది పనులకు హాజరవుతున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఎక్కువగా వ్యవసాయ సంబంధ పనులు చేపట్టగా.. రైతులు తమ పొలానికి వెళ్లే దారులు, మట్టి పనులు, చెరువు పూడిక తీతలు, కాల్వల నిర్మాణాలు, అంతర్గత రోడ్లు, ట్యాంకు, మినీ ట్యాంకుల నిర్మాణాలు సహా వివిధ రకాల పనులు చేయిస్తున్నారు. మహిళా కూలీలు అత్యధికంగా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. అయితే, ఇంతటి ముఖ్యమైన ఉపాధి హామీ పనులపై కేంద్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో కూలీలు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. ఇక వారం రోజులకు ఒకసారి కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన కూలి నగదు కూడా నాలుగు నెలలు గడిచినా జమ కావడం లేదు.

| గడిచిన ఐదేళ్లుగా పనిదినాల సంఖ్య ఇలా.. |
|---|
| 2020-21లో 59.97 లక్షల పని దినాలు |
| 2021-22లో 51.55 లక్షల పని దినాలు |
| 2022-23లో 45.38 లక్షల పని దినాలు |
| 2023-24లో 43.16 లక్షల పని దినాలు |
| 2024-25లో 32.78 లక్షల పని దినాలు |



# నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**మున్నేరు సీసీ వాల్ ప్రొటెక్షన్ పనులు సకాలంలో పూర్తి కావాలి**

**నిర్మాణ సంస్థ ప్రతినిధుల సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల**



నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 13: మున్నేరు వాగు సీసీ వాల్ ప్రొటెక్షన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వాటిని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని తన నివాసంలో నిర్మాణ సంస్థ ప్రతినిధులతో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు రెండు నియోజకవర్గాల ప్రజలకు సంబంధించినదని అన్నారు. ఇరువైపులా ముంపు సమస్యను నివారించే విధంగా నిర్మాణం ఉండాలన్నారు. అలాగే, ఆహ్లాదపరిచే విధంగా వాల్ నిర్మించాలని సూచించారు. వీలైతే బోటింగ్ సైతం ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్‌లో వాల్ ఎత్తు పెంచుకోవడానికి వీలుగా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఎంత వరద వచ్చినా మురుగుకాలువల ద్వారా నగరంలోని బ్యాక్ వాటర్ రాకుండా పటిష్టమైన డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు మొదలైన ప్రాంతం నుంచి ముగిసే ప్రకాశ్‌నగర్ కింది ప్రాంతం వరకు ఎప్పుడూ నీళ్లు నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రపోజల్ తయారు చేసి ఖమ్మం నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని కోరారు. మున్నేరు నదిలో చెత్త పడేయకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వైకుంఠధామం దగ్గర స్నానాలు చేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట మెట్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ విషయంలో ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాను కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సంస్థ ప్రతినిధులకు తెలిపారు.

# రేపటికల్లా పనులన్నీ పూర్తి చేయండి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



నవమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, ఆర్డీవో దామోదర్‌రావు, ఈవో రమాదేవి

భద్రాచలం, ఏప్రిల్ 13 : భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించి చేపట్టిన పనులన్నీ రేపటికల్లా పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలంలో రామయ్య కల్యాణ మహోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవ వేడుకలను తిలకించడానికి వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. భక్తులు కల్యాణ మండపం వద్దకు నేరుగా వచ్చేందుకు ముఖ్యమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, రూట్ మ్యాప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మండపం వద్ద వివిధ సెక్టార్లలో నియమించిన ప్రత్యేకాధికారులు ఉదయం 8 గంటలకల్లా వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి సెక్టార్‌కు ఇద్దరు శానిటేషన్ సిబ్బందిని ఉంచాలని, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో మంచినీరు, టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, సమాచార, వైద్య శాఖకు సంబంధించిన స్టాళ్లు, హెల్ప్ డెస్క్‌లకు సంబంధించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 25 లొకేషన్ల నుంచి నడవలేని భక్తులకు ప్రత్యేక వలంటీర్ల ద్వారా వీల్‌చైర్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గోదావరి వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గోదావరి వద్దకు వెళ్లలేని భక్తుల కోసం 200 పంపులు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ ఎస్సీని ఆదేశించారు. ముఖ్యంగా కల్యాణ మండపం, భక్తులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా చెత్తను తొలగించాలని ఈవోను ఆదేశించారు. ప్రసాదం కోసం 60 కౌంటర్లు, తలంబ్రాల కోసం 120 కౌంటర్లు, 25 సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణం పూర్తయిన తర్వాత భక్తులు స్వామివారి ప్రసాదాలు తీసుకొని సురక్షితంగా వారివారి గమ్యాలకు చేరేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. అధికారులు, వారి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్ రావు, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేశ్, డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఎస్‌డీసీ సుమ, డీఏవో బాబు రావు, తహసీల్దార్ శ్రీనివాస్, జీపీ ఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, ఏప్రిల్ 13 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం ప్రాకార మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి చతుఃస్థానార్చన చేపట్టారు. ఆ తర్వాత ప్రాకార మండపంలో వేదశాస్త్ర, ఇతిహాస పురాణాదులను వేద పండితులు పఠించారు. సాయంత్రం సార్వభౌమ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ జరిపారు. రహదారులకు ఇరువైపులా బారులు తీరిన భక్తులు తమ ఆరాధ్య దైవానికి కొబ్బరికాయలు, వివిధ రకాల ఫలాలు, హారతులు సమర్పించారు.

### నేడు గరుడ ధ్వజపట లేఖనం

వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరుకల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం గరుడ ధ్వజపట లేఖనం నిర్వహించనున్నారు. జీయర్ మఠంలో తెల్లని వస్త్రంపై గరుత్మంతుడి చిత్రపటాన్ని చిత్రీకరించి మంగళవాయిద్యాల నడుమ అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయానికి తీసుకొని వెళతారు. సోమవారం గరుడ ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించనున్న క్రమంలో గరుత్మంతుడి చిత్రపటానికి గరుడాధివాసాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత యాగశాలకు గరుడ ధ్వజాన్ని తీసుకెళ్లి చిత్రపటాన్ని తెల్లని వస్త్రాలపై పరుండబెట్టి చిత్రపటంపై ధాన్యాన్ని పోసి ధాన్యాధివాసం జరుపనున్నారు.



సార్వభౌమ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

# పోలింగ్ శాతం పెంపుపై దృష్టి పెట్టండి

**అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, మధుసూదన్‌నాయక్

సత్తుపల్లి, ఏప్రిల్ 13 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపుపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, కల్లూరు ఇంచార్జ్ ఆర్డీవో బి.మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ తహసీల్దార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు సమావేశాలు, ర్యాలీల అనుమతుల కోసం రెండు రోజుల ముందుగానే సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన కనీస సదుపాయాలపై తహసీల్దార్లతో చర్చించారు. అనంతరం గంగారం సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపించాలని సిబ్బందికి సూచించారు. తొలుత చెక్‌పోస్టులో రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కె.యోగేశ్వరరావు, ఎంఎ.రాజు, జి.ప్రతాప్, పి.సాంబశివుడు, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో కల్యాణం, పట్టాభిషేకం టికెట్లు

భద్రాచలం, ఏప్రిల్ 13 : భద్రాచలంలో ఈ నెల 17, 18వ తేదీల్లో జరిగే సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను తిలకించడానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ భక్తులు, సామాన్య భక్తుల కోసం టికెట్ల వివరాలు, వసతి కోసం గదులను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఉభయ దాతల కోసం రూ.7,500 టికెట్లు, వీవీఐపీ భక్తుల కోసం రూ.2,500, రూ.2వేల టికెట్లు, సామాన్య భక్తుల కోసం రూ.వెయ్యి, రూ.300, రూ.150 టికెట్లను అందుబాటులో ఉంచామని, https://bhadradritemple.telangana.gov.in ద్వారా టికెట్లు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.

